AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.
5-11-2025 (Wednesday) MAIN EDITION

## నారా భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్'



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ వైస్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు రెండు పురస్కారాలు లభించాయి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025'ను ప్రదానం చేయగా, హెరిటేజ్ ఫుడ్స్‌కు లభించిన 'గోల్డెన్ పీకాక్' అవార్డును కూడా ఆమె స్వీకరించారు.

## భారత్‌కు సహాయం చేస్తాం: చైనా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రెండు వారాలుగా అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించింది. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాంటి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం' అని యూజింగ్ రాసుకొచ్చారు.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు




**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. ఏకకాలంలో 120 కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే ఏసీబీ దాడులు చేపట్టినట్లు సమాచారం. అయితే అధికారులు తనిఖీలకు రాగానే డాక్యుమెంట్ రైటర్లు దుకాణాలకు తాళాలు వేసుకొని పరారయ్యారు.

## సుడిగాలుల బీభత్సం..



**అక్షరటుడే, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. పలిమెల మండలంలో లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురుగాలులు వీచాయి. సుడిగాలుల ప్రభావంతో అటవీప్రాంతంలో కిలోమీటర్ల పరిధిలో చెట్లు విరిగిపడ్డాయి. సమీపంలోని పొలాలు ధ్వంసం అయ్యాయి.

## హాస్టల్ టాయిలెట్‌లో స్పై కెమెరాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మహిళల వసతి గృహం టాయిలెట్‌లో స్పై కెమెరాలు అమర్చిన ఘటన కలకలం సృష్టిస్తోంది. మంగళవారం రాత్రి ఒక టాయిలెట్‌లో వాటిని గుర్తించిన మహిళలు ఆందోళనకు దిగారు. తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. ఈ ప్రాంతం కర్ణాటకకు సమీపంలో ఉంది.

## పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్య



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** పోలీస్ స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వ్యక్తి అర్ధరాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. దమ్మాయిగూడకు చెందిన సింగిరెడ్డి మీన్ రెడ్డి (32) మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు తనతో వ్యవహరించిన తీరుతో మనస్తాపం చెందిన మీన్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

## పంజాబ్‌లో కబడ్డీ ప్లేయర్ కాల్చివేత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పంజాబ్‌లోని లుధియానాలో ఓ కబడ్డీ ప్లేయర్ దారుణ హత్యకు గురయ్యాడు. లుధియానా జిల్లాలోని సమ్రాలా బ్లాక్‌లో కబడ్డీ ఆటగాడు గుర్వీందర్ సింగ్‌ను దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అన్మోల్ బిష్ణోయ్ పేరిట సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. గుర్వీందర్ సింగ్‌ను తమ గ్యాంగ్‌కు చెందిన కరణ్, తేజ్ చక్ అనే వ్యక్తులు చంపినట్లు అందులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపుచర్యలు చేపట్టారు.

**రాష్ట్రంలో రహదారులు రక్తమోడుతున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎంతో మంది యాక్సిడెంట్లలో చనిపోతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ద్విచక్ర వాహనాల నుంచి మొదలుకొని ఆర్టీసీ బస్సుల వరకు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొని 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈ ఏడాది రోడ్డుప్రమాదాలపై కథనం..** –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# రక్తమోడుతున్న రహదారులు



- రాష్ట్రంలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- 2 వేల మందికి పైగా మృత్యువాత
- అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో యాక్సిడెంట్లు

రాష్ట్రంలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో సగటున ప్రతి రెండు గంటలకు ఒకరు మృతి చెందుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 6,417 కిలో మీటర్ల మేర రహదారులు ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 7,333 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో 2,702 మంది చనిపోగా.. 8,118 మంది గాయపడ్డారు.

### అతివేగంతో..

అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయి. చాలా మంది వాహనదారులు అతివేగంగా డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అతివేగంతో 4,717, ర్యాష్ డ్రైవింగ్ కారణంగా 3,562 చోటు చేసుకున్నాయి. డ్రంకన్ డ్రైవ్ ప్రమాదాలు 117, రాంగ్ రూట్ డ్రైవింగ్ 228, సిగ్నల్ జంపింగ్ కారణంగా మూడు ప్రమాదాలు, ఫోన్ వాడుతూ వాహనం నడపడంతో మూడు యాక్సిడెంట్లు అయ్యాయి.

### ఆ వాహనాలే అధికం

ఎక్కువగా కార్లు, ద్విచక్ర వాహనాలే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ఏడాది 2,432 కార్లు, జీపులు, 2,426 ద్విచక్ర వాహనాలు, 1,589 లారీలు, 511 బస్సులు, 461 ఆటోలు, 77 భారీ వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరుతున్నారు.

### ఇటీవల ఘటనలు

- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో 19 మంది చనిపోయారు. 20 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు.
- హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు కర్నూల్ జిల్లా చిన్నటేకూరు సమీపంలో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 20 మంది సజీవ దహనం అయ్యారు. గత నెల 24న ఈ ప్రమాదం చోటు చేసుకుంది.
- నవంబర్ 4న కర్నాటక ఆర్టీసీ బస్సు వికారాబాద్ జిల్లా తాండూరు వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.
- సంగారెడ్డి జిల్లాలో నవంబర్ 5న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద బ్రేక్ ఫెయిల్ అవడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

## బీహార్ పోలింగ్‌కు సర్వం సిద్ధం




- 6న తొలి విడత ఎన్నికలు
- ఓటు వేయనున్న 3.75 కోట్ల మంది
- బరిలో 1,314 మంది అభ్యర్థులు
- ఎన్డీయే, మహాఘట్‌బంధన్ మధ్య తీవ్ర పోటీ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం (నవంబర్ 6) తొలి దశ పోలింగ్ జరగనుంది. అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా, మహాఘట్ బంధన్ అధికారం చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 121 నియోజకవర్గాలలో మొదటి దశ పోలింగ్ జరుగుతుంది. దాదాపు 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రచారం పరిసమాప్తం కావడంతో మైకులు మూగబోయాయి. ఇన్నాళ్లు ప్రచార హడావుడిలో ఉన్న నేతలు.. ఓటర్లకు ప్రలోభాలను ఎరవేసే కార్యక్రమంపై దృష్టి సారించారు.

### కూటముల మధ్యే ప్రధాన పోటీ..


బీహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా, నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరగనుంది. బీజేపీ, జేడీ(యూ) నేతృత్వంలోని ఎన్డీయే ఒకవైపు, ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్ నేతృత్వంలోని కాంగ్రెస్, దీపాంకర్ భట్టాచార్య నేతృత్వంలోని సీపీఐ (ఎంఎల్), సీపీఐ, సీపీఎం, ముఖేష్ సహానీకి చెందిన వికాశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)లతో కూడిన మహాఘట్‌బంధన్ కూటమి అధికారం కోసం తీవ్రంగా పోరాడుతున్నాయి. కొత్తగా బరిలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ పార్టీ జన్ సురాజ్ కూడా రాష్ట్రంలోని 243 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టింది. ఎన్డీయే, మహాఘట్ బంధన్ కూటముల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అవగాహన కుదిరింది: కిషన్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడలోని వెంకటగిరిలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, బీఆర్ఎస్‌కు మధ్య ఎలాంటి ఒప్పందం లేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం నలుగురి దుర్మరణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కర్ణాటక రాష్ట్రంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తెలంగాణకు చెందిన నలుగురు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ తాలూకాలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన పలువురు కర్ణాటకలోని గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి కారులో వెళ్లారు. దర్శనం అనంతరం బుధవారం ఉదయం తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చసుకుంది. బీదర్ జిల్లాలోని హల్లిఖేడ్‌లో వీరి కారును ఎదురుగా వస్తున్న డీటీడీసీ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. మృతుల్లో జగన్నాథ్‌పూర్‌కు చెందిన నవీన్ (40), రాచప్ప (45), నాగరాజ్ (40), కాశీనాథ్ (60) ఉన్నారు. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని బీదర్ బ్రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రయాణికులను ఢీకొన్న రైలు.. ఆరుగురి మృతి


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తర ప్రదేశ్‌లో విషాదం చోటు చేసుకుంది. పట్టాలు దాటుతున్న ప్రయాణికులను రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందినట్లు సమాచారం. మీర్జాపూర్‌లోని చునార్ రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. యాత్రికులు ఉదయం 9.15 గంటల ప్రాంతంలో గోమో-ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నుంచి ట్రాక్‌లను దాటడానికి ప్రయత్నిస్తుండగా, ప్లాట్‌ఫామ్ నంబర్ మూడు నుంచి వెళుతున్న కల్కా మెయిల్ వారిని ఢీకొట్టింది. ప్రయాణికులు ప్లాట్ ఫామ్‌పై కాకుండా ట్రాక్ వైపు దిగి.. పట్టాలు దాటుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. రైలు ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టాలపై మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.

## హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ: రాహుల్‌గాంధీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని ఆయన ఆరోపించారు. పోలైన ఓట్లకు, ఫలితాలకు తేడా ఉందని ఆరోపించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోనూ ఓట్ల చోరీ జరిగిందన్నారు. హర్యానాలో ఒక యువతికి 10 బూత్‌లలో 22 ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. అయితే ఆ ఫొటోలో ఉన్న యువతి బ్రెజిల్‌కు చెందిన మోడల్ అని ఆయన పేర్కొన్నారు.

## వర్జీనియా గవర్నర్‌గా హైదరాబాదీ మహిళ విజయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా స్థానిక ఎన్నికల్లో భారత సంతతికి చెందిన నేతలు సత్తా చాటారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమోక్రాట్ నాయకురాలు గజాల హష్మీ గెలుపొందారు. అమెరికా రాష్ట్రాల్లో ఈ పదవికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు. ఈమె హైదరాబాద్ మూలాలున్న మహిళ కావడం విశేషం. గజాలా హష్మీ 1964లో హైదరాబాద్‌లో జన్మించారు. బాల్యంలో మలక్‌పేటలోని తన అమ్మమ్మ ఇంట్లో కొంతకాలం నివసించారు. ఆమె తాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక విభాగంలో పనిచేశారు. నాలుగేళ్ల ప్రాయంలో తన తల్లి, సోదరుడితో కలిసి గజాలా అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. ఆ తర్వాత అక్కడే స్థిరపడ్డారు. 2024లో ఆమె సెనేట్ విద్య, వైద్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా డెమోక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

## సోనాక్షి సిన్హా ఇంట్రెస్టింగ్ కామెంట్స్



బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, నటుడు జహీర్ ఇక్బాల్‌ని వివాహం చేసుకొని ఏడాది దాటింది. గత ఏడాది జూన్‌లో ప్రత్యేక వివాహ చట్టం కింద ఈ జంట ఒక్కటైనప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చే నడిచింది. మతాంతర వివాహంపై కొందరు ట్రోలింగ్ చేయగా.. ఆ తర్వాత విమర్శలు ఆగిపోయాయి. అయితే ఇటీవల ఈ-టైమ్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సోనాక్షి తన వైవాహిక జీవితం, విమర్శలు, ప్రేమపై తన ఆలోచనలను స్పష్టంగా వెల్లడించింది. 'నేను ఎప్పుడూ నమ్మేది ఒక్కటే. ప్రేమ ఎప్పుడూ గెలుస్తుంది. జనాలు ఎంత ద్వేషం చూపించినా, నిజమైన ప్రేమ దానిని అధిగమిస్తుంది. మేము ఎటువంటి డ్రామా చేయలేదు, ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకున్నాను అంతే. నేనేమీ మతాంతర వివాహం చేసుకున్న మొదటి మహిళను కాదు, చివరిదీ కాదు. మా ప్రేమలో ఉన్న నిజాయతీని, బంధాన్ని ప్రజలు తర్వాత గమనించారు. అందుకే ఆ ట్రోలింగ్, ద్వేషం వాటంతట అవే ఆగిపోయాయి' అని సోనాక్షి చెప్పింది.

– అక్షరటుడే, సినిమా డెస్క్